# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 28-06-2025** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ గతిని మార్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు.**
2. **ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్" కార్యక్రమం రేపు ఉదయం 11 గంటలకు ప్రసారమవుతుంది.**
3. **రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యతనిస్తున్నామని హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు.**
4. **విద్యుత్ ఛార్జీలు తగ్గించడంపై ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు.**
5. **టిడ్కో ఇళ్ల పునర్నిర్మాణ కార్యక్రమం చేపడుతున్నట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు.**

==========================

మాజీ ప్రధానమంత్రి పీవీ నరసింహారావు ఆర్థిక సంస్కరణల ద్వారా దేశ గతిని మార్చారని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అన్నారు. పీవీ నరసింహారావు జయంతి సందర్భంగా ఈరోజు సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆయనకు నివాళులర్పించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఆయన ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించారని గుర్తుచేశారు. పీవీ నరసింహారావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ కొనియాడారు.

-------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 123వ సంచిక రేపు ఉదయం 11 గంటలకు ప్రసారం అవుతుంది. మన్ కీ బాత్ తెలుగు అనువాదం ప్రధాని ప్రసంగం అయిన వెంటనే ఒకసారి, రాత్రి 8 గంటలకు మరోసారి ఉభయ తెలుగు రాష్ట్రాలలోని అన్ని ఆకాశవాణి కేంద్రాల ద్వారా ప్రసారమౌతుంది.

-------------------------

రాష్ట్రంలో శాంతిభద్రతలకు ప్రాధాన్యతనిస్తున్నామని హెూంశాఖ మంత్రి వంగలపూడి అనిత అన్నారు. విజయవాడలో ఎన్టీఆర్ పోలీస్ కమీషనరేట్ నిర్వహించిన డివైన్ సురక్ష కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ లక్ష్మీశ,

స్థానిక శాసన సభ్యులు బోండా ఉమామహేశ్వరరావు, గద్దె రామ్మోహన్ రావు, సుజనా చౌదరిలతో కలిసి మంత్రి ఈరోజు  పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ...

..వాయిస్.. 26 సెకన్లు

---------------------------

విశాఖపట్నం జిల్లా సింహాచలంలో ఉన్న శ్రీ వరాహ లక్ష్మి నృసింహ స్వామి వారిని  రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి ఈరోజు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా మంత్రికి వేద పండితులు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం మంత్రి కొలుసు పార్థసారథికి ఆలయ కార్యనిర్వహణాధికారి స్వామివారి చిత్ర పటాన్ని అందజేశారు.

---------------------------

విద్యుత్ ఛార్జీలు తగ్గించడంపై  ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు  ఆ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ స్పష్టం చేశారు. విశాఖపట్నంలోని సాగర్ నగర్‌లో ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ నూతన భవనాన్ని మంత్రి నిన్న ప్రారంభించారు. అనంతర ఆయన పాత్రికేయుల సమావేశంలో మాట్లాడారు. ప్రజలకు 24 గంటలు నాణ్యమైన విద్యుత్ ను అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తున్నట్లు మంత్రి తెలుపుతూ..

వాయిస్ .. 23 సెకన్లు

---------------------------

టిడ్కో ఇళ్ల పునర్నిర్మాణ కార్యక్రమం చేపడుతున్నట్లు పురపాలక శాఖ మంత్రి నారాయణ తెలిపారు. ప్రకాశం జిల్లాలోని ఒంగోలు అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ చేపడుతున్న కార్యక్రమాలపై ఆయన నిన్న సమీక్షించారు. దీపావళి నాటికి ఇళ్ళను పూర్తి చేసి లబ్దిదారులకు అందిస్తామని మంత్రి తెలుపుతూ..

- వాయిస్ ..23 సెకన్లు

---------------------------

ఆర్థిక సంస్కరణలకు మాజీ ప్రధానమంత్రి  పీవీ నరసింహారావు దోహదపడ్డారని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు మల్లాది విష్ణు అన్నారు. విజయవాడలోని సత్యనారాయణ పురంలో ఈరోజు పివి నరసింహారావు జయంతి సందర్భంగా ఆయనకు నివాళులర్పించారు.

మరోవైపు.. ఈరోజు సాయంత్రం సత్యనారాయణపురంలో పీవీ నరసింహారావు విగ్రహాన్ని ఆవిష్కరించనున్నామని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు.

---------------------------

దేశంలో జూన్ 25, 1975న, అప్పటి ప్రధానమంత్రి అత్యవసర పరిస్థితిని విధించిన నేపథ్యంలో భారత ప్రభుత్వం ఆ తేదిని 'సంవిధాన్ హత్య దివస్' –రాజ్యాంగ హత్య దినంగా పాటిస్తోంది. 1975 అత్యవసర పరిస్థితిని ఎదుర్కొన్న వారందరిని  స్మరించుకుంటూ, ప్రతి భారతీయుడిలో వ్యక్తిగత స్వేచ్ఛ, ప్రజాస్వామ్య రక్షణపై అవగాహన కల్పిస్తూ ఈ నెల 30వ తేదీ వరకు కేంద్ర ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తోంది.

---------------------------

వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలను పాటిస్తే రహదారి ప్రమాదాలను నియంత్రించవచ్చని తిరుపతి జిల్లా ఎస్పీ హర్షవర్థన్ రాజు అన్నారు. తిరుపతిలోని పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో ప్రభుత్వం అందజేసిన 27నూతన ద్విచక్రవాహనాలను ఎస్పీ ఈరోజు ప్రారంభించారు. తిరుమల, తిరుపతి, శ్రీకాళహస్తి, పుత్తూరు, రేణిగుంట, నాయుడుపేట, గూడూరులోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్లకు ఈ వాహనాలను అందించామని ఎస్పీ పేర్కొంటూ..

వాయిస్.. 31 సెకన్లు

-----------------------------

పాత్రికేయునిగా, కథా రచయితగా, సినీ రచయితగా, నిర్మాతగా తెలుగు వారి హృదయాలలో చెరగని ముద్ర వేసిన ముళ్లపూడి వెంకటరమణ జయంతి ఈ రోజు. 1931వ సంవత్సరం జూన్ 28వ తేదీన తూర్పు గోదావరి జిల్లా ధవళేశ్వరంలో జన్మించిన ముళ్లపూడి.. హాస్య రచనలకు పేరొందారు. ఆయన రాసిన పిల్లల పుస్తకం “బుడుగు” తెలుగు సాహిత్యంలో ఒక విశిష్ట స్థానం సంపాదించింది. ప్రఖ్యాత చిత్రకారులు, దర్శకులు బాపుతో ముళ్లపూడి జీవితం పెనవేసుకు పోయింది. వీరిద్దరూ బాపు–రమణ జంటగా ప్రసిద్ధులయ్యారు. ముళ్లపూడి ఆత్మకథ కోతి కొమ్మచ్చి పేరుతో వెలువడింది.

-----------------------------

ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట మండలం ముక్త్యాల గ్రామంలో రెడ్ క్రాస్ బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తలసేమియా వ్యాధి బాధితులకు రక్తం అవసరమని తెలిపారు. యువత రక్తదానం చేయడానికి ముందుకు రావాలని కోరారు.

-----------------------------

కోకో రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న రాయితీ పొందేందుకు ఈనెల 30వ తేదీ లోపు ఉద్యానవన శాఖకు దరఖాస్తు చేసుకోవాలని ఏలూరు జిల్లా ఉద్యానవన శాఖాధికారి ఎస్. రామ్మోహన్ ఒక ప్రకటనలో తెలిపారు. కోకో పరిశ్రమలు కేజీకి 450 రూపాయలు, ప్రభుత్వం 50 రూపాయల రాయితీ కలిపి మొత్తంగా కేజీ 500 రూపాయలకు కోకో గింజలు కొనుగోలు చేయాలని నిర్ణయించినట్లు వెల్లడించారు. రైతులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

-----------------------------

రాష్ట్రంలోని ప్రస్తుత వాతావరణ పరిస్థితిపై అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం అధికారి జి.లక్ష్మి ఆకాశవాణి ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ..

వాయిస్... 18 సెకన్లు

=====================